ప్రజాశక్తి
సోమవారం 24 జులై 2023
5
పార్వతీపురం మన్యం

25న అమ్మఒడి ర్యాలీ

ప్రజాశక్తి - బలిజిపేట

పార్వతీపురంలో ఈనెల 25న జరిగే అమ్మఒడి ర్యాలీని విజయవంతం చేయాలని బలిజిపేట ఎంఇఒ-1 సామల సింహాచలం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గ స్థాయిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే అమ్మఒడి ర్యాలీ కార్యక్రమం పార్వతీపురంలో జరుగుతుంది. ఈ ర్యాలీ ఉదయం 9 గంటలకు పాత బస్ స్టాండ్ లో పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభిస్తారని తెలిపారు. కావున మండలం నుండి అమ్మఒడి లబ్ధిదారులు, 9,10 తరగతుల హై స్కూల్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే మండలంలోని హైస్కూల్ హెచ్ఎంలంతా తప్పని సరిగా హాజరు కావాలని, అమ్మఒడి లబ్ధిదారులు, విద్యార్థులు హాజరయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎంఇఒ కోరారు.

మణిపూర్ ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు

పలుచోట్ల మానవహారాలు, నిరసన ర్యాలీలు, కొవ్వొత్తుల ప్రదర్శన

మణిపూర్ రాష్ట్రంలో జరిగిన ఘటనలకు నిరసనగా జిల్లాలో ప్రజాసంఘాల ఆధ్వర్యాన సర్వత్రా ఆందోళనలు జరిగాయి. ఆదివాసీ గిరిజన సంఘం, సిఐటియు, ఐద్వా, వామపక్షాలు, ఇతర ప్రజాసంఘాలు మావహారాలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, వివిధ రూపాల్లో నిరసనలు తెలిపాయి.

పార్వతీపురంలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

గుమ్మలక్ష్మీపురంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న గిరిజన సంఘాల నాయకులు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

మణిపూర్‌లో గిరిజనులపై జరుగుతున్న దాడికి నిరసనగా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్ మాట్లాడుతూ మణిపూర్‌లో ఇద్దరి గిరిజన మహిళలను అర్ధనగ్నంగా ఊరేగించి చంపడం చాలా బాధాకరమన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు మత ఘర్షణలు సృష్టిస్తూ గిరిజనులు, గిరిజనేతరుల మధ్య చిచ్చుపెట్టిందన్నారు. మరోవైపు గిరిజనేతరులను ఎస్‌టి జాబితాలో చేర్చడానికి బిజెపి ప్రధాన కుట్ర చేస్తుందన్నారు. మణిపూర్‌లో ఉన్న భూ ఖనిజాలు కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించేందుకు గిరిజనులను అక్కడ నుంచి వెళ్లగొట్టించేందుకు బిజెపి అల్లర్లు సృష్టిస్తుందన్నారు. బిజెపి నిరంకుశ వైఖరిని ప్రజలంతా ఎండగట్టాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ, నాయకులు ఎం సన్యాసిరావు, ఇండియా, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

కొవ్వొత్తులతో ప్రదర్శన

మణిపూర్‌లో మహిళలపై జరిగిన అఘాయిత్యాలపై మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఆదివాసి సంక్షేమ పరిషత్, ఆదివాసీ టీచర్ అసోసియేషన్, ట్రైబల్ రైట్స్ ఫోరం ప్రతినిధులు పాల్గొన్నారు. నిందితులను వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటన పునరావృతమైతే రాష్ట్ర స్థాయి నుంచి దేశం మొత్తం ఆదివాసీలమంతా ఏకమై మహిళలపై జరుగుతున్నటువంటి అఘాయిత్యాలకు నిరసనగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్తంభింప చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రోబ్బా లోవరాజు, మన్యం జిల్లా అధ్యక్షులు ఐ.రామకష్ణ, ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు యడ్ల సూర్యనారాయణ, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ తాడంగి సత్యనారాయణ, గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండగి రమణ, ఆదివాసి టీచర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సెక్రటరీ భగవన్, బిడ్డిక గైయిమి,మెల్లక ప్రమీల, భారతి, ప్రభావతి పాల్గొన్నారు.

పాచిపెంట : మణిపూర్ జరుగుతున్న హింస హత్యాకాండను నిరసిస్తూ పాచిపెంట మండల కేంద్రం గాంధీ బొమ్మ ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. సిఐటియ మండల నాయకులు చింత పోలిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు, ఆదివాసీ ఐక్యవేదిక నాయకులు పడాల తమ్మయ్య మాట్లాడుతూ మణిపూర్ హత్యాకాండకు మోడీ విధానాలే కారణమన్నారు. ఇప్పటికైనా ఈన దుర్మార్గానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించి గిరిజనులకు రక్షణ కల్పించాలని లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు స్వయారి, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని పూతికవలస ప్రాంతంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన తెలిపారు. మణిపూర్‌లో మహిళలపై జరిగిన దాడికి నిరసన తెలిపారు. ఆదివాసీలపై అఘత్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారని గిరిజన సంఘ జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిరసిస్తూ సిఐటియు మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ మణిపూర్‌లో విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే కుట్ర ఉందని, మానవత్వంలేని ప్రధానిగా మోడీ చరిత్రలో మిగిలిపోతారని విమర్శించారు. తక్షణం అల్లర్లకు పాల్పడే అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకుని, మాణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. మేధావులు, అభ్యుదయవాదులు, యువకులు ప్రజాస్వామికవాదులు, దేశ సమైక్యతను కోరుకునేవారు తక్షణం మోడీ ప్రభుత్వ మతోన్మాద చర్యలను ఖండించాలని, లేకపోతే మాణిపూర్ ప్రయోగం దేశవ్యాప్తంగా బిజెపి, ఆరెస్సెస్ అమలు చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు లక్ష్మి, భానుమూర్తి, జ్యోతిలక్ష్మి, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : మణిపూర్‌లో జరుగుతున్న అరాచకానికి ముగింపు పలకాలని, ఇటీవల జరిగిన సంఘటన ఖండిస్తూ దోషులను కఠినంగా శిక్షించాలని సిఐటియు ఆధ్వర్యంలో మహిళలతో కలిసి నిరసన చేపట్టారు. రెండు, మూడు నెలల నుంచి ఈ ఘటనలు జరుగుతున్నా ప్రధానమంత్రి కళ్లు మూసుకుని పరిపాలన చేస్తున్నారా అని సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు జోక్యంతో మణిపూర్‌లో జరుగుతున్న అరాచకానికి ముగింపు పలకాలని ప్రజాతంత్ర వాదులు. లౌకికవాదులు ఈ దుర్మార్గాన్ని ఖండించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు శాంతి, చంద్ర, లక్ష్మి, ఆటో యూనియన్ కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

పిడిఎస్‌ఒ ఆధ్వర్యాన

బెలగాం :మణిపూర్ సంఘటనకు నిరసనగా పిడిఎస్‌ఒ ఆధ్వర్యాన స్థానిక ఆర్‌టిసికాంప్లెక్స్ నుంచి తహశీల్దార్ కార్యాలయం మీదుగా వైఎస్ విగ్రహం వరకూ నిరసన ర్యాలీ జరిగింది. అనంతరం అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పిడిఎస్‌ఒ జిల్లా అధ్యక్షులు కె.సోమేష్ మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై జరిగిన ఘటన యావత్ భారతదేశాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేసిందన్నారు. మహిళలను ఎంతో గౌరవిస్తామని చెప్పుకుంటున్న ప్రభుత్వాలు కనీసం ఈ విషయంపై మాట్లాడకపోవడం, స్వయానా ప్రధాని నరేంద్ర మోడీ ఈ విషయంపై 30 సెకండ్ల మాత్రమే స్పందించడం ఈ ప్రభుత్వానికి మహిళల రక్షణకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నాయో అర్థం అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.రుద్రి, చిరంజీవి, సోమశేఖర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : మణిపూర్ లో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగింపు చేయడం పట్ల దళిత, గిరిజన సంఘాలు పట్టణంలో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. యాలం అంబేద్కర్ జంక్షన్లో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలియజేశారు. మణిపూర్ సంఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాని వెంటనే రాజీనామా చేయాలని, ప్రధాని భారతదేశానికి ఒక సైతానని వర్ణించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫారం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు బత్తిని మోహన్, డివిజన్ అధ్యక్షులు గురుబిల్లి రవికుమార్, దళిత యువసేన నాయకులు పాల్గొన్నారు.

పాలకొండలో నిరసన తెలుపుతున్న దళిత, గిరిజన సంఘాల నాయకులు

మణిపూర్ ఘటనను ప్రజలంతా ఖండించాలి
నేడు వామపక్షాల ఆధ్వర్యాన నిరసన

కలెక్టరేట్: మణిపూర్‌లో మైనింగ్ మాఫియా అక్కడ బిజెపి ప్రభుత్వం సహకారంతో సాగిస్తున్న హత్యలు, అత్యాచారాలు, మానభంగాలును సంఘవిద్రోహ చర్యలను ప్రజలంతా ఖండించాలని, ఈనెల 24న తలపెట్టిన నిరసనలో ప్రజలంతా పాల్గొనాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన వామపక్ష నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రెడ్డి వేణు, కె.రామస్వామి (సిపిఎం), కూరంగి మన్మథరావు (సిపిఐ), పి.శ్రీనునాయుడు (సిపిఐ ఎంఎల్), బి.నర్సింగరావు (సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ), పి.సంగం (లిబరేషన్ గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు), పి.రంజిత్‌కుమార్ (గిరిజన సంక్షేమ సంఘం) మాట్లాడారు. మణిపూర్‌లో బిజెపి ప్రభుత్వం గిరిజన జాతుల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి ఆ పేరుతో గిరిజనులను, మహిళలపై అత్యాచారాలు, మానభంగాల, నగ్నంగా ఊరేగించడాలు, గృహ దహనాలకు పాల్పడ్డాన్ని ప్రజలంతా ఖండించాలని అన్నారు. దీని వెనుక ఉన్న మైనింగ్ మాఫియా, కార్పొరేట్ కంపెనీల ఈ దుర్మార్గాలకు తెగబడుతున్నాయని, ఈ సంఘ విద్రోహ శక్తులు, వీరికి సహకరిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని శిక్షించాలని కోరారు. మహిళలు, గిరిజనులపై బిజెపి రాష్ట్ర ప్రభుత్వం అండతో సాగిస్తున్న దమనకాండని మన రాష్ట్రంలో ఉన్న అధికార, ప్రతిపక్షాలు నోరువిప్పకపోవడం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గాలను ఖండిస్తూ వామపక్షాలు పార్వతీపురంలో సోమవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు జరిగే నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని వామపక్ష పార్టీల నాయకులు కోరారు.

మహిళలకు రక్షణ కల్పించాలి : ఐద్వా

కలెక్టరేట్ : మహిళలకు రక్షణ కల్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనంలో వివిధ ప్రజాసంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళల పట్ల క్రూరంగా ప్రవర్తిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళలకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఈనెల 29న పట్టణంలో జరుగు బస్సుయాత్రను, ఆగస్టు 9న విజయవాడలో జరుగు బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది టి. జోగారావు, ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు, సిఐయుటి జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, యుటిఎఫ్ మండల నాయకులు బంటు జగన్నాథం, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కద్రక రామస్వామి, ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ నాయకులు రాజు, ఐద్వా నాయకులు గెద్ద తులసి, ఆర్‌పిల సంఘం నాయకులు రెడ్డి సుజాత, లక్ష్మీ, డివైఎఫ్‌ఐ నాయకులు, న్యాయవాది వెంకటేశ్వరావు మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించారు.

అంతుచిక్కని గుమ్మిడి అంతరంగం

- సీనియర్లతో సర్దుబాటుకు నో
- భంజ్ దేవ్‌తో భేటీలో స్పష్టం
- చంద్రబాబు చెప్పినా ససేమిరా

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, సాలూరు నియోజకవర్గ ఇన్చార్జి గుమ్మిడి సంధ్యారాణి అంతరంగం అంతుచిక్కడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆమె వ్యవహారశైలిని ఆమె సొంత అనుచరులే అంచనా వేయలేకపోతున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలనుకునే ఏ పార్టీ నాయకుడు లేదా నాయకురాలైనా నాలుగు ఓట్లు ఉన్న స్థానిక నాయకులతో సఖ్యత కోరుకుంటారు. రాజకీయంగా శత్రువైనా గెలుపు కోసం వారి సహకారం కావాలని అభ్యర్థిస్తారు. కానీ ఇక్కడ నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి వ్యవహారశైలి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. సొంత పార్టీకి చెందిన అంగబలం, అర్థబలం ఉన్న నాయకులను కలుపుకుని పోవడానికి ఆమె ఇష్టపడడం లేదు. సాలూరు పట్టణం, మక్కువ, పాచిపెంట మండలాలకు చెందిన సీనియర్ నాయకులతో సర్దుబాటుకు ఆమె అంగీకరించడం లేదు. కొద్దిరోజుల క్రితం టిడిపి అధినేత చంద్రబాబునాయుడు నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి వ్యవహారశైలిని ఆయన పూర్తిగా తప్పుబట్టారు. మక్కువ మండలానికి చెందిన సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు, పాచిపెంట మండల పార్టీ అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబును కలుపుకునిపోవాలని చంద్రబాబు నాయుడు ఆమెకు సూచించారు. భంజ్‌దేవ్ సలహా సూచనల మేరకు నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఆమె శుక్రవారం భంజ్‌దేవ్‌తో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ భేటీలో ఇద్దరి మధ్య వాదోపవాదాలు తారాస్థాయికి వెళ్ళినట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల్లో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి సమావేశానికి సంబంధించిన అంశంపై ఆమె భంజ్‌దేవ్‌తో చర్చించారు. సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావును తాను పిలవబోనని, మీరే పిలవాలని భంజ్‌దేవ్‌తో ఆమె చెప్పినట్లు తెలుస్తోంది. రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థిగా పెంట తిరుపతిరావును కలుపుకొని పోవాల్సిన బాధ్యత మీదేనని భంజ్‌దేవ్ సంధ్యారాణికి సూచించారు. అయినా ఆమె తిరుపతిరావును తాను పిలిచేది లేదనే ఖరాఖండిగా భంజ్‌దేవ్‌కి చెప్పినట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశించినా సీనియర్ నాయకులతో కలిసి పనిచేయడానికి సంధ్యారాణి సుముఖత వ్యక్తం చేయకపోడం పార్టీ శ్రేణులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇదిలా వుండగా తనను కలుపుకుని వెళ్లేందుకు ఇష్టపడని సంధ్యారాణి తీరుపై సీనియర్ నాయకులు పెంట తిరుపతి రావు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తనను సమావేశానికి పిలవడానికి ఇష్టం లేని సంధ్యారాణికి వ్యతిరేకంగా మరో గిరిజన అభ్యర్థిని రంగంలోకి దింపుతానని ఆయన వాట్సాప్‌లో బహిరంగ లేఖ విడుదల చేశారు. రానున్న ఎన్నికల్లో తన సత్తా ఏమిటో చూపిస్తానని ఆయన ప్రకటించారు. త్వరలో కొత్త అభ్యర్థితో ప్రచారం మొదలు పెడతానని స్పష్టం చేయడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలను విస్మయానికి గురిచేస్తోంది. సీనియర్లను కలుపుకుని పోవడంలో సంధ్యారాణి అనుసరిస్తున్న వైఖరిని టిడిపికి కొంతమంది తటస్థ నాయకులు, కార్యకర్తలు తప్పుపడుతున్నారు. రాజకీయాల్లో పట్టువిడుపులు వుండాలని, నేను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్న చందంగా సంధ్యారాణి వ్యవహారశైలి ఉండడం సరికాదని వారు అభిప్రాయపడుతున్నారు. తాజా పరిణామాలు పార్టీని ఎటు తీసుకెళ్తాయోనని సామాన్య కార్యకర్త లు ఆందోళన చెందుతున్నారు.

నిధులున్నా నిర్లక్ష్యం

- వేతనాలు చెల్లించని అధికారి
- ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతున్న సిబ్బంది
- ఇదీ తోటపల్లి దేవస్థానం ఉద్యోగుల దుస్థితి

ప్రజాశక్తి గరుగుబిల్లి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో చిన్న తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి దేవస్థానంలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడునెలలుగా జీతాల్లేవని, తమ బాధ ఎవరికి చెప్పవాలోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు చెల్లించేందుకు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఇబ్బందులు పడుతున్నారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఆలయంలో ప్రధానార్చకుడు, భజంత్రీల బృందం, పారిశుద్ధ్య పని వారు. ఇతర సిబ్బంది కలిపి 10మంది ఉన్నారు. గత మూడు నెలలుగా జీతాల్లేక నానా అవస్థలు పడుతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలో ఆదాయం ఉన్నప్పటికీ ఆలయ అధికారి జీతాలు ఇచ్చేందుకు విముఖత చూపుతున్నారని వారు చెబుతున్నారు. ఇటీవల హుండీ లెక్కింపు, కేశఖండన ద్వారా ఆలయానికి కొంత ఆదాయం వచ్చిందని, అయినా తమకు జీతాలు చెల్లించడంలేదని తెలిపారు. అహర్నిశలూ ఆలయ పనితో పాటు అభివృద్ధికి తమ శక్తి మేరకు కృషి చేస్తున్నామని చెబుతున్నారు. జీతాలు చెల్లించకపోవడంతో పిల్లలు చదువులు, అనారోగ్య సమస్యలపై ఎక్కడికి వెళ్లాలన్నా అవస్థలు పడుతున్నామని వాపోయారు. తమ సమస్యలను ఆలయ అధికారికి దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు. ఇటీవల కాలం జరిగిన ఆడిట్‌లో మార్చి, ఏప్రిల్, మే వరకు సంబంధించిన జీతాలు చెల్లించాలని అధికారులు చెప్పినా కేవలం మార్చి నెల వేతనం చెల్లించి మిగిలిన మూడునెలల వేతనం చెల్లించలేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకువేతన బకాయిలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మా బాధలు పట్టవా?

వేతనాలందక కుటుంబ పోషణ కష్టమవుతుందని ఆలయ అధికారికి తెలియజేసినా జీతాలు సకాలంలో ఇవ్వకపోవడంతో ఇంట్లో ఇబ్బందులు తప్పడం లేదు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా నా పరిస్థితి ఉంది. కష్టాలన్నీ దిగమింగుతూ కాలాన్ని నెట్టుకొస్తున్నాను. ఆలయానికి సంబంధించి ఆదాయం ఉన్నప్పటికీ మాకు జీతాలు సకాలంలో ఇవ్వకపోవడంతో కుటుంబం ఇబ్బందులుపడుతుంది.

వివి అప్పలచార్యులు,
ఆలయ ప్రధాన అర్చకులు.

పాత బాకీలు తీర్చాను

2008లో ఇవ్వాల్సిన బకాయలు ఇవ్వడం జరిగింది. అలాగే కరోనా సమయంలో కూడా ఎవరికీ ఇబ్బంది లేకుండా జీతాలు చెల్లించాం. మార్చి నెల జీతం చెల్లించాం. మరికొద్ది రోజుల్లో ఇవ్వాల్సిన జీతాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. అయితే సిబ్బంది ప్రజాప్రతినిధులు దగ్గరికి వెళ్లడం, తాను జీతాలివ్వడం లేదని చెబుతున్నారు.

- బి.గణేష్,
ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, తోటపల్లి దేవస్థానం

నిధులున్నా సిబ్బందిపై చిరు కన్ను

మేం ఆరుగురుం భజంత్రీల బృందం ఆలయంలో పనిచేస్తూ ఉన్నాం. మా సంపాదన పైనే ఆధారపడి ఉన్న మా కుటుంబ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. మాకు నెలకు ఇచ్చే రూ.7500 వ్యయం గత మూడు నెలలుగా ఇవ్వకపోవడంతో అప్పులపాలై అవస్థలు పడుతున్నాం. అనారోగ్య సమస్య వచ్చి ఆసుపత్రికి వెళ్దామంటే ఆర్థిక పరిస్థితి బాగోలేక అయోమయంగా ఉంటున్నాం. ఆలయ అధికారిని తమకు జీతాలు ఇవ్వమని అడిగితే తాను కొన్ని ఆలయాలకు బాధ్యత వహిస్తున్నానని, తనకు సమయం కుదిరితే ఇస్తానని చెప్పారు. తమ సమస్యను ప్రజాప్రతినిధులకు విన్నవించుకోగా, మాకు డబ్బులిస్తే మేము వ్యసనాలు పాలు చేస్తామని ప్రజాప్రతినిధుల వద్ద మాపై తప్పు గా ప్రచారం చేస్తున్నారు. ఒకవేళ ఆలయ సమయాల్లో వ్యసనాలకు పాల్పడినట్టు అధికారి గుర్తించి తమను విధులు నుంచి సస్పెండ్ చేయవచ్చు. ఇచ్చిన అరకొర జీతాలతో మా కుటుంబ పోషణే కష్టమవుతుంది. ఇక వ్యసనాలకు ఎక్కడి నుంచి డబ్బులు వస్తాయి.

- ఆచంటి శ్రీనివాసరావు, భజంత్రీల బృందం సభ్యులు

కండ్ల కలకలం

ఇబ్బందులు పడుతున్న పిల్లలు, పెద్దలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కండ్ల కళకళ వైరస్‌ను ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత వర్షాకాలం ప్రారంభం కావడంతో ఈ వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉంది. చిన్నపిల్లల్లో కండ్ల కళ్లకు రావడంతో వారు పాఠశాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. అలాగే పెద్దవారికి కూడా ఈ వైరస్ రాగడంతో పనులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని పలువురు అంటున్నారు. ఈ వైరస్‌తో ప్రమాదమేమీ లేకపోయినప్పటికీ వారం రోజుల పాటు బయటకు వెళ్లలేని స్థితిలో బాధితులు ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు కూలీలు ఆవేదన చెందుతున్నారు. మక్కువ, శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పలు గ్రామాల్లో ఈ వైరస్‌తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత కాలంలో ఈ వైరస్ వస్తూ ఉంటుందని, దీనివల్ల స్వల్ప ఇబ్బందులు ఉంటాయని శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రఘుకుమార్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. కండ్లు ఎర్రబారడం, నీరు కారడం, పుసులు కట్టడం లక్షణాలు ఉంటాయని అన్నారు. యాంటీ బయోటిక్స్ డ్రాప్స్ వాడుకున్నట్లయితే సరిపోతుందని, వారం రోజులకు తగ్గకుంటే డాక్టర్లు సంప్రదించాలని ఆయన తెలిపారు.

కండ్ల కలకలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

పూతిక వలస ఆశ్రమ పాఠశాలలో కండ్ల కలకలు

సీతంపేట: మండలంలోని పూతికవలస బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సుమారు 20 మంది బాలికలు కండ్లు కలకలతో బాధ పడుతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 480 మంది విద్యార్థినిలు చదువుతున్నారు. కల్లు కాలకలు సీజన్ కావడంతో అన్ని ప్రాంతాల్లోని పాఠశాలల్లో వ్యాప్తి చెందుతున్నాయి. అయితే ఇప్పటికే కళ్లు కలకలు ఉన్నచోట తెలిసిన వెంటనే వైద్యులు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

ఐక్యంగా ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకుందాం

రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆగస్టు 9న జరగబోయే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను గిరిజనులంతా ఐక్యంగా ఉండి నిర్వహించేందుకొనేందుకు తీర్మానించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో గిరిజన జెఎసి, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో వాటి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, నేటితరం యువతకు తెలియజేయాలని అన్నారు. ఆదివాసీలు నివసిస్తున్న గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ప్రభుత్వం నిర్వహించాలన్నారు. దీనికి విరుద్ధంగా ప్రతి ఏటా ప్రభుత్వం పార్వతీపురంలో నిర్వహించడమేమిటని ప్రశ్నించారు. ఐటిడిఎ అధికారులు, ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేకపోయినా మనకు మనమే చందాలు ఎత్తుకొని మన ఉనికిని కాపాడుకోవాలని నిర్ణయించారు. ఈ ఏడాది నిర్వహించబోయే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు ప్రతి గ్రామం నుంచి యువత, మహిళలు, ఉద్యోగులు వచ్చి జయప్రదం చేయాలని, మన ఐక్యతను చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో గిరిజన సంఘం నాయకులు కె.లక్ష్మణమూర్తి, పువ్వల సత్యనారాయణ, నందివాడ కృష్ణబాబు, మండంగి రమణ, కోలక అవినాష్, కద్రక మల్లేశ్వరరావు, పాలక క్రాంతికుమార్, ఎల్.లోవరాజు, ధర్మారావు, యువత, ఉపాధ్యాయులు, ఆదివాసీ పెద్దలు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న గిరిజన సంఘాల నాయకులు

ఆదివాసీ హక్కుల పరిరక్షణ స్టీరింగ్ కమిటీ ఎన్నిక

అనంతరం ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక స్టీరింగ్ కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. ప్రధాన సలహాదారుగా కోలక లక్ష్మణామూర్తి, కన్వీనర్‌గా కోలక అవినాష్ ఎన్నికయ్యారు. అలాగే స్టీరింగ్ కమిటీ సభ్యులుగా మండంగి రమణ, ఆరిక ధర్మారావు, కద్రక మల్లేశ్వరరావు, పాలక క్రాంతికుమార్, బిడ్డిక రమేష్, ఇంటి కుప్పల రామకష్ణ, నిమ్మక శ్రీరాము, పత్తిక శంకరరావు, మండంగి శ్రీనివాసరావు, తోయక నాగభూషణరావు ఎన్నికయ్యారు.

1278 సవరణ దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

నియోజక వర్గ స్థాయి ఇంటింట ఓటరు సర్వేలో భాగంగా ఇప్పటి వరకు 1278 సవరణ దరఖాస్తులు అందాయని పార్వతీపురం నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, ఆర్‌డిఒ కె.హేమలత తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటరు సమ్మరీ రివిజన్‌లో హౌస్ టు హౌస్ సర్వే ద్వారా ఓటర్ జాబితాలో ఉన్న తప్పిదాలను - డోర్ నెంబరు "0" ఉన్నవి, జంక్ క్యారెక్టర్స్ ఉన్నవి, ఒకే ఇంటిలో పది మంది కన్నా ఎక్కువ మంది ఓటర్లు ఉన్నట్లుగా కానీ, వాస్తవంగా వేరే కుటుంబాలుగా ఉన్నటువంటి ఓటర్లను గుర్తించి సరిచేయడానికి, రెండు శాతం కన్నా ఎక్కువ తొలగింపులు జరిగిన పోలింగ్ కేంద్రాల వద్ద తప్పిదాలు ఏమైనా ఉన్నాయా లేవా అని చూడ్డానికి, ఇప్పటి వరకు ఓటరుగా నమోదు కాని యువతను గుర్తించి వారికి ఓటు హక్కు కల్పించడానికి ఆదివారం బూత్ స్థాయి అధికారుల ద్వారా సర్వే చేశామన్నారు. ఈ సర్వే ప్రక్రియ పరిశీలించడానికి తహశీల్దార్లు ఆకస్మిక తనిఖీలు చేపట్టారని చెప్పారు. బిఎల్‌ఒల పనితీరు మెరుగుపడేలా ఇదివరకే శిక్షణా తరగతులను నియోజకవర్గ, మండల స్థాయిలో జరిగాయన్నారు. ప్రతిరోజూ బిఎల్‌ఒల సర్వేను పురస్కరించుకొని, పురోగతిపై ప్రతిరోజూ సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సర్వే మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు 1278 సవరణ దరఖాస్తులు వచ్చాయని, ఒక్క ఆదివారమే 616 దరఖాస్తులు సవరణల కోసం వచ్చాయని ఆర్‌డిఒ తెలిపారు.


పార్వతీపురంలో కురుస్తున్న వర్షం

సీతంపేటలో కుండపోత వర్షం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. సీతంపేట ఏజెన్సీలో గత వారం రోజులుగా వర్షాలు కురవడంతో వాగులు వంకలు గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. అయితే ఇప్పటికే ఏజెన్సీలో ఆశించిన స్థాయిలో వర్షాలు సకాలంలో పడకపోవడంతో ఖరీఫ్ పనుల్లో రైతులు వెనుకబడ్డారు. ఆదివారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. దీంతో దమ్ములు పూర్తి అవుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి నాట్లు సిద్ధం చేస్తున్నారు.

పార్వతీపురం టౌన్: పట్టణంలో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. కుండపోతగా కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారితో పాటు పలు వీధుల రహదారులు జలమయమయ్యాయి. వర్షపు నీరు, కాలువల్లో మురుగునీరు రహదారిపైనే ప్రవహించడంతో పాదచారులు, వాహన చోదకులు నానా అవస్థలు పడ్డారు.

నేడు రైతు ఉత్పత్తిదారుల కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు.వెంకంపేట పంచాయతీ పరిధి వెంకమ్మసాగరం వద్ద గల రూ.15లక్షలతో నిర్మించిన రైతు ఉత్పత్తిదారుల సంస్థ కేంద్రాన్ని ఈనెల 24న ప్రారంభించనున్నట్లు రైతు ఉత్పత్తిదారుల సంఘం మండల అధ్యక్షులు గొర్లె బలరాం నాయుడు, ఎపిపిఎ సిని వై.ఉసందు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రారంభ ఉత్సవానికి కలెక్టర్ నిశాంత్ కుమార్, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్, ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ హాజరుకానున్నట్లు తెలిపారు.

నేడు 24న ఉచిత కంటి వైద్య శిబిరం

మండలంలోని చిట్టిపుడివలస జంక్షన్ వద్ద గల శ్రీ సత్య సాయి నిత్య అన్నపూర్ణ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం చెందిన శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నామని దీర్ఘకాలిక కంటి రోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి - మక్కువ

రాబోయే ఎన్నికల కోసం మండలంలోని జనసేన కార్యకర్తలంతా సన్నద్ధం కావాలని జనసేన మండల శాఖ కన్వీనర్ గేదెల శివవర్ధన్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రైవేట్ కళ్యాణమండపంలో జనసేన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన సభ్యత్వ నమోదు సంబంధించిన కిట్లను అందజేశారు. ప్రతి ఒక్కరూ ఓటు నమోదు ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నాయకులు రాజు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలి చెందిన వైసిపి సీనియర్ నాయకులు డీలర్ రాజు ఆదివారం మృతి చెందారు. ఈయన ఎస్‌సి కమిషన్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణికి స్వయాన బావ. రాజు మృతి పట్ల ఎమ్మెల్యే ఎ.జోగారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మీనామృతం తయారీపై అవగాహన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని ప్రకృతి వ్యవసాయ గ్రామలైన చిలకాం, నందివానివాలస, గిజబ, దళాయివలస గ్రామాల్లో మీనామృతం కషాయం తయారీపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ కషాయం చేపల వ్యర్థ పదార్ధాలు, బెల్లంతో తయారు చేస్తారు. ఈ కషాయం పిచికారీ చేయడం వల్ల వరి, కూరగాయల పంటలలో వివిధ రకాల తెగుళ్ళ, పురుగులు నివారించేందుకు, మొక్క పెరుగుదలకు అధిక దిగుబడులు సాధించేందుకు ఉపయోగపడుతుందని మండల ఇంచార్జ్ పొలినాయుడు తెలిపారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, మండల ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

దమ్ములకు సిద్ధమవుతున్న రైతులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో వర్షపు నీరు చేరడంతో అన్నదాతలు పొలం పనులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మండలంలోని యు.వెంకంపేట, బూరుగ, నడుకూరు, తదితర ప్రాంతాల్లో చెరువు ఆయకట్టు ఉన్న అన్నదాతలు ట్రాక్టర్లతో పొలంలో దుక్కులు వేస్తున్నారు. యు.వెంకంపేట పంచాయతీ వెంకమ్మ సాగరంలో నీరు పుష్కలంగా ఉండడంతో దుక్కులతో పాటు పారపనులు కూడా చేస్తున్నారు. గత ఖరీఫ్ పనుల కంటే ఈ ఏడాది కూలీలు కూడా అమాంతంగా పెరిగినట్లు అన్నదాతలు చెబుతున్నారు.

నాగావళికి పెరిగిన వరద ఉధృతి

వంగర: నాగావళి నదిలో వరద నీరు భారీగా ప్రవహిస్తుంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం తోటపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తివేశారు. దీంతో ఆదివారం ఉదయం నుంచి నాగావళి నదిలో వరద నీరు ఉధృతింగా ప్రవహిస్తుంది. నాగావళిలో భారీగా వరద నీరు ప్రవహిస్తుండగా, సువర్ణముకి, వేగావతి ఈ రెండు నదుల్లో మాత్రం ప్రస్తుతం కొంతమేర మాత్రమే నీరు ప్రవహిస్తుంది.

25న మడ్డువలస నీరు విడుదల

వంగర : మండలంలోని గొర్లె శ్రీరాములనాయుడు మడ్డువలస ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా ఆయకట్టుకు ఈ నెల 25న సాగునీరు విడుదల చేస్తామని ప్రాజెక్టు డిఇ పి.అర్జున్ తెలిపారు. స్టేజ్-1లో వంగర, రేగిడి, సంతకవిటి, శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, పొందూరు మండలాలకు, స్టేజ్-2లో లావేరు మండలానికి సంబంధించి మొత్తం 30077 ఎకరాలకు గాను నీటిని విడిచిపెడతామని చెప్పారు.

వీడిన హత్యకేసు మిస్టరీ

బొండపల్లి : మండలంలోని గొట్లాం రైల్వే ట్రేక్‌పై అనుమానస్పద స్థితిలో లభ్యమైన మృత దేహానికి సంబంధించిన కేసు మిస్టరీని పోలీసులు చేదించారు. ఈ కేసుకు సంబంధించి అయిదగురును అరెస్టు చేయగా మరో ఇద్దరి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయని బొబ్బిలి ఇంచార్జి డిఎస్‌పి చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు ఆదివారం బొండపల్లి పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 13న రాయగడ నుండి విజయనగరం వైపు వెల్తున్న ఐరన్ లోడ్ లారీని పథకం ప్రకారం మార్గమధ్యలో ప్రయాణీకులు మాదిరిగా ఆపి డ్రైవర్‌తో పరిచయం పెంచుకుని కొంత మంది లారీ ఎక్కారు. లారీలో డ్రైవర్ జగదీష్ యాదవ్ ఒక్కరే ఉండడాన్ని గమనించిన హరి, ఈశ్వరరావు, అర్నేపల్లి ధనుంజయడు, మీసాల జయరాం, మీసాల చంద్రశేఖర్‌తో పాటు మరో ముగ్గరు వ్యక్తులు లారీ పై దృష్టి సారించారు. రూ.40లక్షల విలువైన ఐరన్ లోడును గమనించి మార్గం మధ్యలో డ్రైవర్ జగదీష్‌ను వీరంతా కలిసి హత్య చేశారు. అనంతరం మృత దేహాన్ని గొట్లాం బై పాస్ కిందను గల రైలు పట్టాలపై పడేసి లోడు లారీతో తగరపు వలస మీదుగా భోగాపురం తరలించారు. అక్కడ తుక్కు వ్యాపారస్తుడు బెవర సాయి బాబాకు ఇనుముతో పాటు లారీని కూడా అమ్మే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో లారీ యజమాని పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. కాగా బొబ్బిలి రైల్వే పోలీసులు ఈ కేసును ఈ నెల 20న బొండపల్లి పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. దీంతో బొండపల్లి, గజపతినగరం పోలీసులు లారీ డ్రైవర్ జగదీష్ యాదవ్‌ను హత్య చేసినట్లు గుర్తించి అయిదగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ. 40 లక్షల విలువైన ఐరన్ లోడ్ లారీని స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరి ప్రదాన నిందుతుల కోసం రెండు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని డిఎస్‌పి తెలిపారు. ఈ హత్యకేసు మిస్టరీని చేదించడంలో చాక చక్యంగా వ్యవహరించిన గజపతినగరం సిఐ ఎల్. నారాయణరావు, ఎస్ఐ ఎస్ రవి, బొండపల్లి పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

విజయానికి కఠోర శ్రమ అవసరం : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సభలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

ప్రతి ఒక్కరూ విజయం సాధించాలంటే అలాంటి వారికి కఠోర శ్రమ అవసరమని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన శ్రీ వాసవి, గాయత్రి విద్యాసంస్థల డిగ్రీ విద్యార్థుల ఫేర్వెల్ ఫంక్షన్‌లో ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ, అపజయంతోనే విజయం వరిస్తుందన్నారు. ఒకటి రెండుసార్లు అపజయం వస్తే విద్యార్థులు అక్కడితో ఆగిపోకూడదని, తన లక్ష్య సాధన ప్రయత్నాన్ని కొనసాగించాలన్నారు. అపజయం వచ్చేటప్పుడు మనోస్థైర్యంతో ముందుకు వెళ్లాలని, కృంగిపోకూడదని, చిన్న మనసు చేసుకోరాదని, ఎవరు విజయం సాధించినా ఆ విజయం వెనుక కఠోర శ్రమ ఉంటుందనే విషయాన్ని మర్చిపోరాదు అన్నారు. విజయం అంత సులభంగా సిద్ధించదనేది గుర్తెరగాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక, కఠోర శ్రమ, వ్యక్తిగత క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పాజిటివ్ యాటిట్యూడ్ అనే పంచ సూత్రాలను పాటిస్తే విజయం తథ్యమన్నారు. అలాగే అనుకున్నది జరగకపోతే అధైర్య పడకూడదన్నారు. ఈ సందర్భంగా తన జీవిత ప్రస్థానాన్ని విద్యార్థులకు ఉదాహరణగా వివరించారు. ఉపాధ్యాయ వత్తి నుండి జాయింట్ కలెక్టర్ స్థాయికి చేరే ప్రయాణంలో ఎదుర్కొన్న ఆటుపోటులను విద్యార్థులకు వివరించారు. అపజయం వచ్చేటప్పుడు కొంతమంది ప్రోత్సహిస్తే, కొంతమందే నిరుత్సాహ పరుస్తారని అవేవీ పట్టించుకోకుండా తనకు తానే మనోస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం అవకాశాలు అధికంగా ఉన్నాయని, ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు శ్రమించాలన్నారు. జీవితంలో అత్యున్నత శిఖరాలకు చేరుకొని కన్న తల్లిదండ్రులకు, చదువు చెప్పే అధ్యాపకులకు, చదువుకున్న విద్యా సంస్థకు చక్కని పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆ విద్యాసంస్థల కరస్పాండెంట్ పీవీకే మణికుమార్, ప్రిన్సిపాల్స్ ఎంవిఎస్ శర్మ, కళావతి ఎఒలు గౌరీ శంకర్ , శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం మధ్యలో నిలిచిపోయిన ఇంటి నిర్మాణం

భారీగా పెరిగిన పిక్కరాయి ధర

నిలిచిన భవనాల పనులు

పనుల్లేక అవస్థలు పడుతున్న కార్మికులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

కొన్ని రోజుల ముందుగా భవన నిర్మాణాలకు అవసరమయ్యే పునాది రాయి, ఇసుక, 20 ఎంఎం సైజ్ పిక్క రాయి, 40 ఎంఎం సైజ్ రాయిని అమ్మకాలు చేసే సంబంధిత యజమానులు మెటీరియల్ రేట్లు ఒకేసారి పెద్దమొత్తంలో పెంచేశారు. దీంతో భవన నిర్మాణదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ రేట్లు పెంపుతో ఇప్పటి వరకు జరిగిన నిర్మాణ పనులను నిలిపివేశారు. నిర్మాణ పనులు ఆగిపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేక ఖాళీగా ఉంటూ తమ కుటుంబాన్ని పెంచుకునేందుకు అవకాశం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతూ రోడ్డునపడ్డారు. మెటీరియల్ రవాణా చార్జీతో కలిపి భవన నిర్మాణ సామాగ్రి గతంలో తక్కువగా ఉండేవి. ఇప్పుడు ఇలా రెట్లు పెరగడానికి కారణం కేవలం మైనింగు యజమానులేనని భవన నిర్మాణ కార్మికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.4వేలు ఉంటే ప్రస్తుతం రూ.5వేలకు పెరిగింది. పునాదురాయి ట్రాక్టర్ లోడు రూ.2,700 ఉండగా, ప్రస్తుతం రూ.3,500 పెరిగింది. అలాగే 20 ఎంఎం పిక్క యూనిట్ గతంలో రూ.4,500 ఉండగా, ప్రస్తుతం రూ.5,500 ఉంది. 40ఎంఎం పిక్కరాయి ట్రాక్టర్ లోడు రూ.3,600 కాగా, ఇప్పుడు రూ.4,500కు పెరిగింది. ఇలా అయితే సామాన్య, మధ్యతరగతి ప్రజలు సొంత ఇంటి కల నెరవేరేలా లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా భవన నిర్మాణ మెటీరియల్ ధరలు పెంచుకుంటూ పోతే సంబంధిత మైనింగ్ అధికారులు చోద్యం చూడడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కురుపాం కోటలో ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - కురుపాం

మాజీ ఎంపి వైరిచర్ల ప్రదీప్‌దేవ్ కుమారుడు వీరేష్ చంద్రదేవ్ ఇటీవల తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడును కలిసి పార్టీలో చేరి అనంతరం కురుపాం వచ్చిన నేపథ్యంలో తన కోట వద్ద ఆదివారం తెలుగు తమ్ముళ్లకు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కురుపాం నియోజకవర్గంలో ఉన్నటువంటి ఇన్చార్జి జగదీశ్వరి గ్రూపు, రెండో గ్రూపుగా ఉన్న ఆశావాసులు ఈ ఆత్మీయ సమ్మేళనంలో కనిపించారు. అంతేకాక వీరేష్ చంద్ర దేవ్ అందర్నీ కలుపుకుంటూ ప్రతి ఒక్కర్నీ కలుస్తూ వెళ్తుండడంతో ఇంతవరకు ఎడమొఖం పెడ మొఖం ఉన్న రెండు గ్రూపులు ఒక్కటై టిడిపికి పూర్వ వైభవం వస్తుందని తెలుగు తమ్ముళ్ల ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో గల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వాహనాలు వేలం

ప్రజాశక్తి - కురుపాం

నాటుసారాతో పట్టుబడిన వాహనాలను ఈనెల 24న (సోమవారం) స్థానిక పోలీసు స్టేషన్‌లో వేలం వేస్తున్నట్లు ఎస్సై సిహెచ్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారాతో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలు, ఒక మినీకమాండర్ జీపును ఎస్ఇబి సూపరింటెండెంట్, కురుపాం పోలీసుల ఆధ్వర్యాన వేలం వేయడం జరుగుతుందని తెలిపారు. కావున ఆసక్తి గలవారు వేలం పాటలో పాల్గొనవచ్చునని అన్నారు.

మద్దతుధరలేక కొండచీపుర్ల రైతులు విలవిల

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులు ఆరుగాలం శ్రమించి సేకరించిన అటవీ ఉత్పత్తులకు మార్కెట్ ధర లేక గిరిజనులు విలవిలలాడుతున్నారు. సీతంపేట ఏజెన్సీలో ప్రతి ఉత్పత్తి నాణ్యతగా ఉంటుందని మైదాన ప్రాంత వాసులు ఉత్పత్తులపై ఎగబాకుతారు. కానీ ఉత్పత్తులు కొనుగోలు చేసినప్పుడు దళారులు సిండికేట్‌గా మారి కారుచౌకగా కొనుగోలు చేస్తారు. దీంతో గిరిజనులు నష్టాలు చవిచూస్తున్నారు. సీతంపేట ఏజెన్సీలో కొండచీపుర్లు అంటే మైదాన ప్రాంత వాసులు ఇష్టపడతారు. కొండ చీపుర్లు నాణ్యతగా, సున్నితంగా, నాజూగ్గా ఎక్కువ కాలం మన్నిక వస్తుంది. అందుకే పట్టణవాసులు మొగ్గుచూపుతారు. అయితే సీతంపేట ఏజెన్సీలో సుమారు 3వేల హెక్టార్ల వరకు కొండచీపుర్లు గిరిజనులు వేస్తున్నారు. ఈ కొండ చీపుర్ల పంట పూతికవలస, మర్రిపాడు, దోను బాయి, శంభం, పొల్ల, కుసిమి పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా పండుతుంది. జనవరి, ఫిబ్రవరి, మార్చిలో ఎక్కువగా పండుతుంది. అయితే అప్పట్లో మార్కెట్ ధర పలకదన్న ఉద్దేశంతో కొంత మంది అప్పట్లో నిల్వ ఉంచి జూలై, ఆగస్టులో మార్కెట్ ధర మరింత ఎక్కువ పలుకుతుందన్న ఉద్దేశంతో సోమవారం జరిగే సీతంపేట సంతకు ఆదివారం మధ్యాహ్నం కొండసీపుర్లు విక్రయించడానికి సంత మార్కెట్‌కు తీసుకొచ్చారు. అయినా మార్కెట్ ధర పడి పోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కొక్క కొండ చీపురు రూ.40లోపే ధర పలుకుతుంది. విశాఖపట్నం, రాజమండ్రి, పర్లాకిమిడి, ఒడిశాలోని కటక్, విజయవాడ, తదితర పట్టణాల నుంచి దళారులు సంతకు వస్తారు. మార్కెట్లో ధర లేకపోవడం సిండికేట్‌గా మారడంతో గిరిజన నష్టాలు చవిచూస్తున్నారు. దీనిపై జిసిసి మేనేజర్ దాసరి కృష్ణ వద్ద ప్రస్తావించగా జనవరి నుంచి ఏప్రిల్ వరకే దీనికి సీజన్ ఉంటుందని, అప్పట్లో ఏ గ్రేడ్ రూ.45, బి గ్రేడ్ రూ.40, సి గ్రేడ్ రూ.35కు కొనుగోలు చేశామని తెలిపారు. ప్రస్తుతం సీజన్ కాదు గనుక కొనుగోలు చేయడం లేదని సమాధానం ఇచ్చారు.

సీతంపేట సంతలో విక్రయానికి ఉన్న కొండచీపుళ్లు

గిరిజన మహిళకు పాముకాటు

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన మహిళ పాముకాటుకు గురైన సంఘటన మండలంలో జి. శివడ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం కె.వరలక్ష్మి (52) సం అనే గిరిజన మహిళ పెరట్లోకి వెళ్లిన సమయంలో పాము కాటేసిందని, వెంటనే స్థానికులు ఆమెను ఆటోతో మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అందించి. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.

25న తూడిలో జగనన్న సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తూడి, బిటివాడ గ్రామాల్లో ఈనెల 25న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.జయంతి ప్రసాదు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది సమయం పాటించి హాజరుకావాలని ఆయన కోరారు. అలాగే ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'మహాశక్తి'పై టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - మక్కువ

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి టిడిపి కార్యకర్త పనిచేయాలని ఎ.వెంకంపేట మాజీ సర్పంచ్ పెంట తిరుపతిరావు పిలుపునిచ్చారు. మండలంలోని ఎ.వెంకంపేట, కన్నంపేట గ్రామాల్లో మాజీ సర్పంచ్ బలగ రామకృష్ణ ఆధ్వర్యంలో మహ శక్తి పథకం ప్రచర కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ నాయకులు కంటే పార్టీ ముఖ్యమని, పార్టీ నిర్ణయంతో అంతా కట్టుబడి పని చేయాలని సూచించారు. ప్రస్తుం జరుగుతున్న ఓటర్ జాబితా తనిఖీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ తమ ఓట్లను సరిచూసుకోవాలని సూచించారు. ఇటీవలే టిడిపిలో చేరిన ఎస్టీ సెల్ నాయకులు హిముకర ప్రసాద్ కూడా ఈ కార్యక్రమంలోముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ రెండు గ్రామాల్లో ర్యాలీలుగా టిడిపి శ్రేణులు వెళ్లే మహాశక్తి పథకం స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెంకటభైరిపురం, చప్పుబుచ్చింపేట మాజీ సర్పంచ్‌లు డి.పరమహంస, సిహెచ్ తిరుపతిరావు, కోన పంచాయితీ యూత్ లీడర్ కణం నాయుడు, మరిపి అప్పలనాయుడు, ఎం.పాపినాయుడు పలువురు టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

కురుపాం : టిడిపి మేనిపోస్టులో ప్రవేశపెట్టిన మహాశక్తి పథకం మహిళల సంక్షేమ పథకం అని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద మహాశక్తి శక్తి చైతన్య రథం వాహనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు 'ఆడబిడ్డ నిధి' కింద నెలకు రూ.1500, అలాగే దీపం పథకం కింద మహిళలకు ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితం, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు చొప్పున పంపిణీ, మహిళలు జిల్లాలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చునని, మహాశక్తి పథకం మహిళలకు ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకం అమలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం స్థానిక గాంధీ నగర వీధిలో ఇంటింటికి వెళ్లి మహాశక్తి కరపత్రాలు పంపిణీ పథకం ఆవశ్యకతను మహిళలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి ఐదు మండల కన్వీనర్లు, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కురుపాం : ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

పాలకొండ రూరల్: మండలం బెజ్జి పంచాయతీలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తి యాత్ర జరిగింది. టిడిపి మేనిఫెస్టో ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని యూనిట్ ఇంచార్జ్ కర్నేన యోగిత అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తి యాత్ర మహిళ నేతలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలను, అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ అలుగోలు లక్ష్మి, వార్డు సభ్యులు వావిలపల్లి జగదీశ్వరి, తెగల లక్ష్మి, కడగల శ్రీదేవి, అలుగోలు గౌరిశ్వరి, పూడి మల్లేశ్వరి, మాజీ వార్డ్ సభ్యులు బొంతు పార్వతి, మహిళాసంఘాల కమిటీ సభ్యులు లక్ష్మి, బొంతు మూగతమ్మ, స్థానిక మహిళా నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాలకొండ, మక్కువలో మహాశక్తి పథకంపై ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

తోటపల్లిలో శ్రీమదాంధ్ర మహాభాగవత సప్తాహం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తోటపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీమదాంధ్ర మహాభాగవత సప్తాహం కార్యక్రమం ఆదివారం ఘనంగా ప్రారంభించారు. శ్రీమదాంధ్ర మహాభాగవత సప్తాహం కార్యక్రమం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, భగవద్గీత ప్రచారకులు, భాగవతోత్తములు కంచుమోజు రామ్మోహనరావు మాస్టర్ సంపూర్ణ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. ఈనెల 29 వరకు శ్రీ బమ్మెర పోతనామాత్య విరచిత శ్రీ మదాంధ్ర మహాభాగవతం కార్యక్రమాన్ని పతిరోజు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వహణ అధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. ఈ మేరకు విశ్రాంత తెలుగు పండితులు, ప్రముఖ భాగవతోత్తములు పెంట సింహాచలం ఆధ్వర్యంలో శ్రీమదాంధ్ర మహాభాగవత సప్తాహం కార్యక్రమం నిర్వహించామన్నారు. అలాగే ఈనెల 29న శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తోటపల్లి టెంపుల్స్ డెవలప్మెంట్ సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ద్వారపురెడ్డి ధనుంజయరావు, ఆవాల కన్నయ్య, యాక్టివ్ ట్రస్టీ జి.శ్రీరామచంద్రమూర్తి, కో మేనేజింగ్ ట్రస్టీ పొట్నూరు గౌరీ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు. ఈ మేరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమమును విజయవంతం చేయాలని ఈవో మహాలక్ష్మీనగేష్ కోరారు.

దిష్టిబొమ్మల్లా బిఎస్ఎన్ఎల్ టవర్లు

ప్రజాశక్తి - కురుపాం :

మండలంలో గత ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రజలకు అత్యవసర సమయంలో మొబైల్ ద్వారా సమాచారం పొందేందుకు, తెలియజేసేందుకు జి.శివడ, వలసబల్లేరు పంచాయతీ కేంద్రాల్లో బిఎస్ఎన్ఎల్ టవర్లు నిర్మించారు. దీనివల్ల సుమారు 90 గిరిజన గ్రామాలకు ఈ సేవలు ఉపయోగకరంగా ఉన్నాయి. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ అది కేవలం దిష్టిబొమ్మల్లా ఉండడం తప్ప సిగ్నల్స్ ఎప్పుడు వస్తాయో, ఎప్పుడు పోతాయో తెలియదు. సిగ్నల్స్ అందుబాటులో ఉండడం లేదని గిరిజన ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గత 15 రోజులుగా కనీసం ఒక్కరోజు కూడా సిగ్నల్ వచ్చే దాకాల్లేవని, ఆరోగ్యపరంగా ఏ ఒక్కరికి అవసరమైనా అత్యవసర సమయంలో కనీసం 108కు ఫోన్ చేద్దామన్న సిగ్నల్ సదుపాయం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సెల్‌టవర్ మరమ్మతులు చేపట్టి సిగ్నల్స్ అందించేలా చూడాలని గిరిజనులు కోరుతున్నారు. కోరుతున్నారు.

జి. శివడ పంచాయితీలో మరమ్మతులకు గురైన బిఎస్ఎన్ఎల్ టవర్

ఎట్టకేలకు రహదారికి మోక్షం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమి గ్రామ రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. 2007లోనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిదిమి గ్రామపంచాయతీని ఆదర్శ పంచాయతీగా ఎంపిక చేసి సుమారు రూ .97లక్షలతో కలింగ శ్రీకాకుళం పార్వతీపురం జంక్షన్ నుండి చిదిమి వరకు బీటీ రోడ్డును పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణ పనులు జరిగేటప్పుడు అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాలం చెల్లకముందే శిథిలావస్థకు చేరుకుంది. అప్పటి నుంచి నుంచి ఇప్పటి వరకు విద్యార్థులు, గర్భిణీలు, ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎక్కడికక్కడే రహదారి గుంతలు ఏర్పడడంతో వర్షాలకు రోడ్డుపె నీరు చేరిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రస్తుతం ఈ రహదారికి రూ.కోటీ 41 లక్షలతో నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి లభించింది. ఈ పనులు ఐటిడిఎ పర్యవేక్షణలో ఉపాధి హామీ నిధులతో జరగనున్నాయి.

శిథిలావస్థలో ఉన్న చిదిమి రోడ్డు

25న సాలూరు, పార్వతీపురం నియోజకవర్గ స్థాయి సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం

సాలూరు, పార్వతీపురం నియోజకవర్గ స్థాయి సమావేశాలు ఈ నెల 25న జరగనున్నట్లు డిఆర్ఒ జె.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 25న ఉదయం 10 గంటలకు పార్వతీపురంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సాలూరు నియోజకవర్గ స్థాయి సమావేశం, మధ్యాహ్నం 2 గంటలకు పార్వతీపురం నియోజకవర్గ స్థాయి సమావేశం జరుగుతుందని ఆయన చెప్పారు. జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి , రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరు అవుతారని ఆయన పేర్కొన్నారు. కురుపాం నియోజకవర్గ స్థాయి సమావేశం ఆగస్టు 1వ తేదీన, పాలకొండ నియోజకవర్గ స్థాయి సమావేశం ఆగస్టు 8వ తేదీన ప్రతిపాదించడం జరిగిందని ఆయన వివరించారు.